# నీవుండేదా కొండపై



– సిహెచ్. వేణు

"నీవుండేదాకొండపై నా సామీ...నే నుండే దీనేలపై..."

హోటల్ రేడియోలోంచి మధురంగా విన్పిస్తూంది పాట.

ఆ పాట వింటూ కాఫీ త్రాగుతుంటే చాలా హాయిగా అన్పిస్తూంది.

రోజూ ఉదయం ఆఫీస్‌కి బయల్దేరే ముందు ఆ హోటల్ దగ్గర ఆగి కాఫీ త్రాగి వెళ్ళడం అలవాటు.

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా హోటల్ కొచ్చి కాఫీ త్రాగుతున్నాను.

అది పెద్ద హోటల్ కాదు. మామూలు చిన్న గుడిసెలాంటిది.

"పాట చాలా బాగుంది కదూ బ్రదర్" అన్నాడు నా ముందు కూర్చున్న వ్యక్తి.

అతన్ని అంతకు ముందు చాలా సార్లు మా వీధిలోనే చూసాను. కానీ పెద్దగా పరిచయం లేదు.

"చాలా బాగుంది" క్లుప్తంగా చెప్పాను అప్పుడు అన్పించింది.

"ఎంత బాగా వ్రాసారు ఆ పాట...నీ వుండేదాకొండపై...నేనుండే దీనేలపై... అహహా... అదిరిపోయింది.. . అన్నట్టు దేవుడు కొండపైనే ఎందుకుంటాడు"

అలా అనుకోగానే నాకో విషయం గుర్తుకొచ్చింది.

నన్నోసారి ఎవరో అడిగారు.

"దేవుడిని నమ్ముతావా?"

నన్నెవరు అడిగారబ్బా ఆఫీస్ కొలీగ్ సుబ్బారావా? కాదే...మరి వెంక ట్రావా?... కాదే...మరి... మరి... ఫ్రెండ్ వెధవ రత్నాకరా? కాదే... పోనీ...నా శ్రీమతా?... అమ్మో... శ్రీమతి అయ్యుండదు. ఎందుకంటే తనకు దైవభక్తి మహా ఎక్కువ. అందుకే తన ముందు దైవాన్ని కొలుస్తాను. ఇంకెవరబ్బా?... పోనీలే ఎవరో ఒకరు. జ్ఞాపకం రాకపోతే ఎందుకిలా ఆలో చించి చావడం... అలా అడిగితే నేనేం చెప్పాను? ఎప్పుడూ చెప్పే విషయం చెప్పానా?

"అవును బ్రదర్! దేవుడ్ని నమ్ము తావా నీవు?"

ఆలోచిస్తున్న వాడినల్లా ఉలిక్కిపడ్డాను.

ఇందాక 'పాట బాగుందని' అన్న వాడే నా వంక సమాధానం కోసం చూస్తున్నాడు.

నాకు హఠాత్తుగా అనుమానమొచ్చింది. ఎప్పుడో ఎవడో అడిగాడని తల బద్దలు కొట్టుకుంటున్నాను. ఆ ఎవడో వీడు...కాదుకదా! వాడేవీడు కావచ్చు... వాడే వాడు కావొచ్చు... చూద్దాం.

"ఏం బ్రదర్ చెప్పవేం?"

"నమ్ముతాను" చెప్పాను.

"అంటే నా రకం కాదన్నమాట. నేనస్సలు దేవుడ్ని నమ్మను."

"నేనూ నమ్మను" చెప్పాను.

ఉలిక్కిపడ్డాడతను.

"ఏమిటి? ఇందాక నమ్ముతానన్నావు"

"అవును"

"మరిప్పుడు నమ్మనంటున్నావు"

"అవును"

"అంటే? నాకర్థం కావడం లేదు"

తాగిన గ్లాస్ బల్లమీద శబ్దం వచ్చేలా పెడ్తూ అన్నాడు అతను విసుగ్గా–చిరాకుగా.

నేను తాగిన గ్లాసు బల్లపై పెట్టాను. నేను నవ్వాను–నవ్వి చెప్పాను.

"నేను దేవుడ్ని నమ్ముతాను. నమ్మను. నాకవసరమనిపించినప్పుడు నమ్మను. దేవుడి గుడికెళ్ళను. కానీ ఎప్పుడయినా వెళ్తే మనస్ఫూర్తిగా మొక్కుతాను నా యిష్టం. ఇంతెందుకు దాదాపు అందరూ నాలాంటివారే! చిన్నప్పటి నుండి అంతే. పరీక్ష దగ్గరికి రాగానే దేవుడు జ్ఞాపకానికొచ్చేవాడు. అంతే."

నేను చెప్పింది విని ఆశ్చర్యపోయాడు.

ఆశ్చర్యం నుంచి తేరుకునే లోపల అక్కడి నుంచి కదిలాను.

* * *

నా అభిప్రాయం చాలా మందితో చెప్పాను. అందరూ నా అభిప్రాయం నేను నాస్తికుడిననుకున్నారు.

"దేవునిమీద నమ్మకం లేకపోతే డైరెక్టుగా అనేసేయ్... కానీ ఎందుకలా వంకర్లుగా చెప్తావు" అని కోప్పడ్డాడు రత్నాకర్.

దాంతో నాకు దేవునిమీద కాస్తయినా భక్తి ఉందని నిరూపించుకోవాలన్న కోరిక ఏర్పడింది.

అవకాశం కోసం ఎదురు చూస్తున్నాను.

ఆ అవకాశం రానే వచ్చింది ఓ రోజు.

* * *

హఠాత్తుగా ఓ రోజు నా శ్రీమతి అంది.

"తిరుపతి వెళ్దాం" అని.

"ఆ వెళ్దాం, ఎండాకాలం వెళ్దాంలే" అన్నాను నేను.

"అది కాదండి. ఇప్పుడు వెళ్దాం ఈ రెండు మూడు రోజులలో..." అంది.

"ఎందుకంత తొందర?" అని ఆశ్చర్యంగా భార్యవంక చూశాడు.

"ఎందుకేముందండి. మొక్కు మొక్కుకున్నాను వస్తానని..." చెప్పింది.

"ఎప్పుడు?" అడిగాను ఇంకా ఆశ్చర్యంగా.

"ఎప్పుడో రెండు సంవత్సరాల క్రితం నుండి...వెళ్దామా? చెప్పండి" అడిగింది గోముగా.

"వెళ్దాంలే. కాదంటే జీవితాంతం సాధిస్తావుగా" అని అన్నాక ఏదో గుర్తుకొచ్చి అడిగాను.

"నా తల వెంట్రుకలయితే ఇస్తానని మొక్కుకో లేదుగా?" అడిగాను కాస్త భయంగా.

"లేదండీ" చెప్పింది నా భయానికి నవ్వుకుంటూ.

"అమ్మయ్యా!" అని రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాను. అప్పుడు గుర్తొచ్చింది నా కోరిక. దేవుడిని కాస్తయినా నమ్ముతానని నిరూపించుకోవాలన్న నిర్ణయం.

ఎందుకయినా మంచిదని కల్పిన

ప్రతివాడికి (అంటే పరిచయస్థులకి) తిరుపతి కెళ్తున్నట్టు చెప్పాను.

నా కొలీగ్ వెంకట్రావ్ నవ్వుతూ అన్నాడు నేను చెప్పింది విన్నాక...

"ఏమన్నా వచ్చిపడిందా అవసరం... ఏమిటి? తిరుపతి కెళ్తున్నావు. దేవుని మీద భక్తి అవసరం కొద్దీ పుట్టుందని నీవే చెప్పావు కదా" అని అన్నాడు.

నేను నవ్వాను. నవ్వి అన్నాను.

"చెప్పా కాబట్టే పాటిస్తున్నా"

అన్నాక మనస్సులో అనుకున్నాను.

"అమ్మనాకొడుకా! నా మాట నాకే తిప్పికొట్టావు కదరా"

నా ఫ్రెండ్ రత్నాకరయితే ఆశ్చర్య పోయాడు.

వాడు ఆశ్చర్యం నుంచి తేరుకునేస రికల్లా మేము తిరుపతిలో ఉన్నాం.

* * *

తిరుపతిలో రైలు దిగగానే ఆలోచిం చాను.

",కొండపై లాడ్జింగ్‌లో ఉండాలా? లేక ఇక్కడే ఉండాలా?" అని...

అదే విషయం నా శ్రీమతి సరోజన డిగాను.

"అంత మాత్రానికే అంతగా ఆలో చించాలా. పైన ఉంటేనే బాగుం టుంది" చెప్పింది.

"కరక్టు" అని కదలబోయాను.

పక్కనే మా మాటలే వింటూ నిల్చు న్నాడేమో ఓ రైల్వే కూలి టక్కున అన్నాడు.

"పైన లాడ్జింగ్‌లు లేవండి" అని.

నేను విని సరోజ వైపు చూసాను.

"ఆ! నాదేముంది? పైనయితే సౌక ర్యంగా ఉంటుందనుకున్నాను" అంది సరోజ తెలివిగా.

కుర్రవాడు నవ్వాడు.

నేను వాడి వంక తీవ్రంగా చూసాను.

టక్కున నవ్వాపాడు.

"సామానులు తీసుకెళ్ళనా షార్" అడిగాడు.

నేను తలూపాను.

ఉదయానే కొండమీదికి బయల్దేరాం.

తిరుపతికి బయల్దేరే బస్సు టికెటల కోసం కౌంటర్‌లో నిలబడ్డాను.

పెద్ద లైను.

సినిమా హాల్లో చిరంజీవి సినిమా వచ్చినా ఇంత జనముండరనుకుం టాను.

టికెట్స్ దొరికాక ఇద్దరం బస్‌లో ఎక్కాము.

డోర్ దగ్గర ఏదో గొడవ కావటం చూసి అడిగాడు పక్కన వ్యక్తిని ఏమి టని...

అతడు చెప్పాడు.

"తిరుమలకి వస్తాడట. డబ్బేమో లేదు. టికెట్ తీసుకోలేదు. అందుకని కండక్టర్ ఎక్కనివ్వడం లేదు"

"మరి...డబ్బు లేకుండా ఎలా వచ్చా డట" అడిగాను నేను.

"డబ్బు లేకుండా రాలేదు. డబ్బు తెచ్చాడట. అంతా రాత్రి ఎవరో దోచుకున్నారట. తన వూరికి వెళ్ళ టానికక్కాడా డబ్బులు లేవట. దేవు డినయినా చూసి పోవాలని ఆత్రుత పడ్తున్నారు."

అప్పుడు జ్ఞాపకానికొచ్చింది. మా ఊర్లో హోటల్‌లో నేను విన్న ఆ పాట.

"నీవుండేదాకొండపై నాసామీ" అని...

ఆ పల్లవి ఆ పాట కరక్టే అనిపించింది.

"దేవున్ని దర్శించుకోడానికి కూడా డబ్బు కావాలా?" అని.

బస్సు కదుల్తుండగా నాకు ఆలో చన వచ్చింది.

'నేను టికెట్ కొని తీసికెళితే?' అవును. పుణ్య స్థలానికొచ్చి మంచి పని చేసినట్టుంటుంది.

వెంటనే బస్సు ఆపించాను.

"ఏమయిందండి?" అడిగింది సరోజ.

నేను సమాధానం చెప్పకుండా బస్సు దిగి ఇందాక కండక్టర్‌ను బతిమిలా డిన వ్యక్తిని పిల్చి టికెట్ కొని బస్సులో ఎక్కించాను.

అందరూ నా వంక విచిత్రంగా చూస్తున్నారు.

నేను మాత్రం అనుకున్నాను.

'దేవుడు కొండపై నుంటేనేమి ...ఇ లాంటి వారికి కాస్తయినా సాయపడే నాలాంటి వాళ్ళు భూమిమీద ఉన్నా రుగా' అని...

## ఏదీ కాదు



భాషకు అక్షరాభ్యాసం చేసీ చేసీ మూగవోయానుకదా! మీరంతా
ఇప్పుడు అర్థం కాదంటూనో అర్థం లేదంటూనో తొడిగిన వీరతాళ్ళ
న్నీ పుటుక్కున తెగిపోవా! ఒక్క పలుకు ఏదో ఒక
విధివంచిత బలహీనక్షణాన ఫెటీల్మని పేలి అందరికీ కబుర్లు
చెప్పకపోదు. రక్తస్పర్శ ఇంకా వుందంటూ అటు బాబర్‌లోనూ
ఇటు రాముడిలోనూ కత్తులు దూసినప్పుడు ఏదీ కాదనేకదా
నిజం పటాపంచలయేది. ఇంతెందుకు ఒకానొక ఈ లోకంలో
ఏదైనా ఎప్పుడైనా అయిందా! మనిషీ మనిషీ స్నేహించుకున్నారా!
మతాలన్నీ ఒక వేదనను శతకోటి రోగాలతో శృతి చేస్తున్నా
ఎవడిపాట వాడిదేకదా! కన్నీళ్ళు నవ్వులయాయా! గాయాలు
పూవులయాయా! హత్యలు జోల పాటలయాయా! దేశభక్తి
గీతం తెరవాలి అంకం మానభంగమే కదా! ఎంత సహజీవనం
ఒక్కరా ఇద్దరా! ఐదుగురో! ఆరుగురో!
చీమూ నెత్తురూ పారే నదుల్లోనా శ్రీధర్‌నజాస్సీ
ఎందుకు ఈత నేర్చుకున్నారు. మేమంతా మనమంతా సిగ్గొదిలేసి
ఒడ్డుమీద నిలబడి జీవితాన్ని కేరింతలు కొడుతున్నందుకే
కదా! చుండూరు గుడిసెలో డంకెల్ ముంజెయి తునక
ఓ పోలీసోడికి దొరికితే వాడు అటూ ఇటూ చూసి జేబు
లోకి నెట్టలేదా! షేశీదు శవంమీద మనమందరం చిల్లర
కలిపిన బొంగు పేలాలమై బొంబాయిలో పేలలేదా! రాజ
మండ్రి సాంబమూర్తీ! ఒరేకన్నా! నువ్వంత విధేయ వినమ్రంగా
చేతులు కట్టుకోకురా ఆ మడతలు విప్పితే సముద్రమంత
దారిద్ర్యం రాలిపడ్తుందిరా! అసహ్యంగా నువ్వు జై కొట్టకురా!
చెప్పల్లేని నీ కాళ్ళతో నన్నూ ఆసీతిగాడ్నీ ఎగిరెగిరి
ఈడ్చి తన్నరా! నువ్వు ఏదో అయిపోతావని నేనెలా నమ్మను.
ఏదీ కాదన్నదే నా బైబిలూ నా ఖురానూ నా భగవద్గీతా ఏదీ కాదన్నా
వంటే ఒకటో రెండో అవుతాయనే అర్థం. భాష ఇంకా అక్షరా
భ్యాసమే నేర్చుకుంటూంది. అర్థం కోసం చెమట బొట్టో కన్నీటి
చుక్కో కొల్చేయ సహనం లేనివాళ్ళు భాషను బడికి వెళ్ళ ని
వ్వరు...ఒరేయ్ హెగెల్సూరస్సెలూ, హెర్మన్యూలూసిపస్సూ
మిమ్మల్నందర్నీ గుండెమీద మొట్టాలి.

—ప్రసేన్